క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన కనుకుంట్ల సాంబలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా విషయం తెలుసుకున్న ఆయన సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు సదయ్య, మహేందర్, ముఖేశ్ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి

నయీంనగర్: వరంగల్ జిల్లాకు మంజూరైన విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి విమానాశ్రయంగా నామకరణం చేయాలని జాగృతి రాష్ట్ర నాయకురాలు మారిపెల్లి మాధవి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే దిశగా అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాణి మంజుల, సమ్మక్క, హైమవతి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి బల్ల పంపిణీ

రామన్నపేట: నగరంలోని రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళ రాజ్యలక్ష్మికి ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ సోమవారం చెక్కబల్ల అందజేశారు. వృద్ధురాలు కావడంతో కింద పడుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకుని బల్ల అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు, స్థానికులు ఎల్లమ్మ, మల్లమ్మ, కుసుమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల అందజేత

వరంగల్: దళిత హక్కుల ఉద్యమ నేత, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ 86వ జయంతిని పురస్కరించుకుని కాశిబుగ్గ వెల్ఫేర్ సొసైటీ కాలనీలోని అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎరుకల రఘునారెడ్డి, గడల కుమార్, బాకం హరిశంకర్, జన్ను ఆరోగ్యం, జన్ను సుబ్రహ్మణ్యం, మైదం సుదర్శన్, పోలెపాక జనార్దన్, విజయ్, సదానందం, రాకేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మడికొండ: మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ సైన్ బోర్డులు, స్టాప్ బోర్డులను ఇన్‌స్పెక్టర్ కిషన్ సోమవారం ఏర్పాటు చేయించారు. భట్టుపల్లి, కడిపికొండ, ఔటర్ రింగ్‌రోడ్డుపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు రాక నష్టపోతున్న విద్యార్థులు

హన్మకొండ: ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లించక, స్కాలర్‌షిపులు చెల్లించకపోవడంతో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక నష్టపోతున్నారని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్య పట్ల చిన్నచూపు చూడడం ప్రభుత్వానికి తగదని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి డిగ్రీలు పూర్తి చేసుకుంటే.. ప్రభుత్వం ఫీజులు చెల్లించడం లేదనే నెపంతో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువ పత్రాలు ఇవ్వకుండా వేధిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.

గ్రూప్ -1 టాపర్‌కు సన్మానం

హన్మకొండ: గ్రూప్ -1 టాపర్ జిన్నా తేజస్విని రెడ్డిని గాంధీనగర్ వాసులు సన్మానించారు. హనుమకొండ గాంధీనగర్‌లో చైతన్య యూత్ అసోసియేషన్ కన్వీనర్ మాడిశెట్టి వీరేందర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు, గాంధీనగర్ వాసులు.. తేజస్విని రెడ్డితో పాటు ఆమె తల్లిదండ్రులు హేమలత, విజయ్‌పాల్ రెడ్డిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, కాలనీవాసులు దుగ్యాల వేణుగోపాల రావు, నక్క లింగయ్య యాదవ్, బత్తిని శ్రీనివాస్, కాసర్ల వెంకటేశ్వర రావు, ఆకుల శ్యాంప్రసాద్, చిట్టిరెడ్డి తిరుపతి రెడ్డి, రామకృష్ణారెడ్డి, కర్ర శ్రీనివాస్ రెడ్డి, కొత్త కరుణాకర్, హన్మాస్ తిరుపతి రెడ్డి, సమ్మెట రాంబాబు, బంక రమేష్, మానుపాటి శ్రీను, సత్యనారాయణ రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కటాక్షపూర్ వంతెన నిర్మాణానికి మోక్షం



హైవేపై పారుతున్న మత్తడి నీరు (ఫైల్)



ప్రారంభమైన వంతెన నిర్మాణ పనులు

- తప్పనున్న రవాణా కష్టాలు
- మొదలైన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు
- వర్షాకాలంలోపు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడిపై హైలెవల్ వంతెన పనులకు నేషనల్ హైవే అథారిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పనులు మొదలయ్యాయి. వంతెన నిర్మాణంతో రవాణా కష్టాలు తప్పనున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి జాతీయ రహదారి (163)పై నుంచే వెళుతుంటుంది. వర్షాకాలం సీజన్‌లో మత్తడి పడడంతో రోడ్డుపై అలుగుపోస్తుంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వాహనదారులు ఇబ్బందులు పడాల్సినన దుస్థితి ఏర్పడేది. ఈ మార్గంలో ఛత్తీస్‌ఘడ్, భూపాలపట్నం వైపు వందలాది లారీలు, గూడ్స్ వాహనాలతో పాటు బస్సులు, ప్రజారవాణా వాహనాలు వెళ్తుంటాయి. వర్షాకాలంలో రవాణా కష్టాలు వెంటాడేవని, వంతెన నిర్మాణం పూర్తి అయితే ఎలాంటి ఆటంకాలు ఉండవని అంటున్నారు. ఆర్టీసీ బస్సులను కూడా దారి మళ్ళించి పంపించాల్సి వచ్చేదని, దశాబ్దాలుగా కటాక్షపూర్ చెరువు మత్తడిపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రభుత్వానికి, అధికారులకు వినతులు సమర్పించినట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా మత్తడి పడుతున్న సమయంలో ఈమార్గంలో బస్సులో రాగా ఈ వంతెన గురించి ప్రస్తావించి ఆరెపల్లి నుంచి ములుగు గట్టమ్మ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు, ఈ వంతెన నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దాదాపు రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా ఈ వంతెనను నిర్మిస్తున్నారు. వంతెనను 120 మీటర్ల పొడవు, 28 మీటర్ల వెడల్పుతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించనున్నారు. వచ్చే వర్షాకాలంలోపే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రవాణా కష్టాలు తొలగించాలంటున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



దామెర : రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎల్కతుర్తి : ముల్కనూరులో కొనసాగుతున్న నిరసన దీక్ష

దామెర : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 7వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విధంగా బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యాకే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. మంత్రివర్గంలో ఇద్దరు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు చోటు కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదని తెల్చి చెప్పారు. నాయకులు వేల్పుల శ్రీనివాస్, కొడకండ్ల శ్రీను, గోవిందు సుధాకర్, దామెర రాజు, దామెర రతన్‌కుమార్, హరీష్, చిన్ని పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే అసెంబ్లీలో ఆమోదించి అమల్లోకి తీసుకురావాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రేణికుంట్ల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. మార్చి 6వ తేదీన క్యాబినేట్‌లో ఎస్సీ వర్గీకరణను ఆమోదించిన అనంతరం 12వ తేదీన అసెంబ్లీలో వర్గీకరణ చట్టాన్ని ప్రవేశపెడుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చట్టాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటస్వామి, భిక్షపతి, సుధాకర్, జగదీశ్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎల్కతుర్తి : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ భీమదేవరపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు ఆశ వర్కర్లు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెన్ఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పద్మ, కల్యాణి, సునీత, భాగ్య, సుకన్య, సౌమ్య, రాజమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ జ్యోతిర్మయినాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎలుకుర్తి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేత



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ నూతన ఆలయ నిర్మాణానికి నారాయణగిరి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాంరెడ్డి విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ. 20వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా దాత ఎన్ఆర్ఐ రాంరెడ్డికి ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు కోరారు. గౌడ సంఘం నాయకులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

మల్లారంలో ఉచిత పశు వైద్యశిబిరం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రీజనల్ అనిమల్ హస్బెండ్రి ట్రెనింగ్ సెంటర్ (ఆర్ఏహెచ్‌టీసీ) ప్రాంతీయ పశువైద్య శిక్షణ కేంద్రం మామునూరు డాక్టర్ బాలాజీ, డాక్టర్ వెంకట్‌రాజు, మండల పశు వైద్యాధికారులు డాక్టర్ మాలతి, డాక్టర్ మాలవిక పాల్గొని 45 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. అలాగే 21 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఏడీ డాక్టర్ ఎస్పీరెడ్డి, వైద్య సిబ్బంది రవి, సుధీర్, గోపాల మిత్రలు రాజయ్య, సురేందర్, చంద్రమౌళి రైతులు పాల్గొన్నారు.

బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సతీశ్



ధర్మసాగర్ : భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన మానుక సతీశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ సోమవారం నియామకపత్రం అందించారు. ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

దామెరలో సలీం మృతదేహం లభ్యం

దామెర : ఎల్కతుర్తి మండల పరిధిలో ఈనెల 8వ తేదీన ప్రమాదవశాత్తు కెనాల్‌లో కొట్టుకుపోయిన మహ్మద్ సలీం మృతదేహం దామెర మండలంలోని కెనాల్‌లో సోమవారం లభించింది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని మృతదేహం సోమవారం దామెర శివారులోని కెనాల్‌లో కొట్టుకువచ్చినట్లు తెలిపారు. కాగా స్థానికులు సమాచారం అందించగా ట్రైనీ ఐపీఎస్ మనన్‌భట్, శాయంపేట సీఐ రంజిత్‌రావుతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఎస్సారెస్పీ డీఈతో మాట్లాడి నీటి ప్రవాహాన్ని తగ్గించారు. స్థానిక రైతు పండుగ శ్రీను సాయంతో మృతదేహాన్ని కాల్వలో నుంచి బయటికి తీసి, ఇతర పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 8న కెనాల్‌లో కొట్టుకుపోయిన వ్యక్తిగా భావించి వారి బంధువులకు సమాచారం అందించామన్నారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఎల్కతుర్తికి చెందిన మహ్మద్ సలీం (25)గా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో పంచనామా చేసి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.

పంథిని మాజీ ఎంపీటీసీ మృతి



బాధిత కుటుంబానికి 'ఎర్రబెల్లి' ఓదార్పు

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయినపెల్లి సోమేశ్వర్‌రావు (70) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఇతర నాయకులు వేర్వేరుగా సోమేశ్వర్‌రావు మృత దేహం వద్ద నివాళులర్పించారు. తక్కళ్లపెల్లి చందర్‌రావు, ప్రేమలత పూర్ణచందర్ రావు, కావటి స్వామి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పెద్దపల్లి ఎమ్మెల్యే పరామర్శ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తడక ఈశ్వర్ తల్లి తడక మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులు తడక ఈశ్వర్, తడక శంకరయ్య, ఇంద్రసేన, సంపత్‌కుమార్ గౌడ్‌ను పరామర్శించారు.

ఆత్మకూరు : మండలంలోని నాగయ్యపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పరికిరాల లక్ష్మి కుటుంబాన్ని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, న్యాయవాది కలకోటి మహేందర్ సోమవారం పరామర్శించారు. ఈ మేరకు కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బస్వారెడ్డి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కత్తి రమేశ్ సూచించారు. ఈ మేరకు మండల విద్యాధికారి శ్రీధర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో గల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడం లేదని, మెనూ ప్రకారం భోజనం అదించక పోవడంతో విద్యార్థులకు సరైన పోషకాహారం లభించడం లేదన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూను బోర్డుపై డిస్‌ప్లే చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందేలా చూడాలని, పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజన పర్యవేక్షణ కమిటీ సభ్యుల పేర్లను బోర్డుపై డిస్‌ప్లే చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ సంఘం నాయకుడు కర్ణాకర్, సతీశ్ పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



సఖి సేవలపై మహిళలకు అవగాహన

నడికూడ : సఖి సేవలను మహిళలు వినియోగించుకోవాలని కేస్ వర్కర్ అనూష, సఖి లీగల్ అడ్వైజర్ శ్రీదేవి కోరారు. ముస్త్యాలపల్లిలో సోమవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రం అందజేస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆశ కార్యకర్తలు గుర్తించి బాధిత మహిళలకు అవసరమైన సహాయం అందించాలన్నారు. సమాజంలో మహిళా సమానత్వం కోసం పాటుపడే వ్యవస్థను నిర్మించుకోవాలని సూచించారు. సఖి స్టాప్ సెంటర్‌లో సిబ్బంది, రెస్క్యూ వ్యాన్ అందుబాటులో ఉంటుందని, బాధిత మహిళలకు కౌన్సెలింగ్, వైద్యసహాయం, తాత్కాలిక వసతి, పోలీస్ సహాయం, న్యాయ సహాయం అందిస్తామని అన్నారు. అత్యవసర పరిస్థితులో 08702452112, 7382983081 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి సిబ్బంది, వీఓఏ విమల, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ లీడర్స్, మెంబర్స్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో అవినీతి అధికారిపై చర్యలు

- రూ.6 లక్షలు కాజేసినట్లు నిర్ధారణ
- విధుల నుంచి తొలగింపు
- పోలీసులకు ఫిర్యాదు

పరకాల : ఆసరా పెన్షన్, ఉపాధి హామీ నగదు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంకటాపురం పోస్టల్ బ్రాంచ్ బీపీఎం నవీన్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పోస్టల్ శాఖ వరంగల్ అడిషనల్ సూపరింటెండెంట్ అనంత్‌రామ్‌నాయక్ తెలిపారు. పరకాల పోస్టల్ శాఖలో నవీన్‌కుమార్‌పై విచారణ అనంతరం అక్రమాలపై రికవరీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. వెంకటాపురం పోస్టల్ శాఖ బీపీఎంగా పనిచేస్తున్న సమయంలో నవీన్‌కుమార్ చనిపోయిన వారి పేరుతో గ్రామ కార్యదర్శి బొటన వేలు అతేంటికేషన్ ద్వారా రూ.6లక్షల కాజేసినట్లు తేలడంతో విధుల నుంచి తొలగించామన్నారు. ఇక ముందు ఏవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసంపూర్తిగా డైనింగ్‌హాల్ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న డైనింగ్‌హాల్ నిర్మాణం

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా డైనింగ్‌హాల్ నిర్మాణానికి గత ప్రభుత్వం హయాంలో రూ.14.50 లక్షల నిధులు కేటాయించింది. పనులు ప్రారంభించిన సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లు పోసి సగం వరకు గోడలు నిర్మించి మధ్యలోనే వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకాన్ని పక్కన పెట్టి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకాన్ని ప్రారంభించడంతో సంబంధిత కాంట్రాక్టర్ చేసిన పనులకు నిధులు రావడం లేదని అందువలనే మధ్యలోనే నిలిచిపోయినట్లు చర్చలు జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసే సమయంలో క్లాస్ రూం వరండా ఎదుట, స్టేజ్‌పై కూర్చొని భోజనం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా డైనింగ్‌హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు పూర్తిచేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఎర్రగట్టు జాతరలో భక్తుల సందడి

- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం క్షీరాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగో రోజు కూడా భక్తుల తాకిడి ఎక్కువగానే కనిపించింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉత్సవాలను పురస్కరించుకుని విశ్వక్సేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి. సాయంత్రం 5గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాలకు అలివేలు మంగ – వేంకటేశ్వరస్వామి వేంచేయనున్నారు.

అద్భుతంగా తీర్చిదిద్దుతా..

ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురైన ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈఓ వెంకట్రామ్, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, గడ్డం శివరాంప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, అటికం రవీందర్ తదితరులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



రూ.1.32 లక్షల విలువచేస్తే ఆస్తి నష్టం

పరకాల : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిళ్లు దగ్ధమైంది. ఈ సంఘటన పరకాల మండలం కామారెడిపల్లిలో చోటుచేసుకుంది. బాధితుడు రేనుకుంట్ల సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తనతో పాటు కుటుంబ సభ్యులంతా కూలీకి వెళ్లినట్లు తెలిపారు. ఆ సమయంలో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైందని వాపోయాడు. ఇంట్లోని వస్తువులు, నిత్యవసర వస్తువులు, వంట సామగ్రి, 5 క్వింటాళ్ల బియ్యం కాలి బూడిదైనట్లు తెలిపారు. దీంతో సుమారు లక్ష 32 వేల విలువచేసే ఆస్తి నష్టం వాటిళ్లినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి



కొత్తగా బిగించిన కెపాసిటర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

ధర్మసాగర్ : వేసవిని దృష్టిలో ఉంచుకుని నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తామని దానికి అనుగుణంగా విద్యుత్ పరికరాలను అమరుస్తున్నామని హనుమకొండ రూరల్ డీఈ సామ్యానాయక్ తెలిపారు. సోమవారం ఆయన ధర్మసాగర్ మండలం జానకిపురం 11 కేవీ ఫీడర్‌పై లోడ్ తగ్గించేందుకు అమర్చిన 600 కేవీఏ లైన్ కెపాసిటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ పరికరం అమర్చినట్లు తెలిపారు. దీనివలన ఈ ఫీడర్‌పై అదనపు భారం తగ్గనుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సిబ్బందికి, అధికారులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ దానయ్య, స్థానిక ఏఈ జ్యోతిర్మయ్‌నాథ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెండ్ చేయాలి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్, రాజ్‌కుమార్, చరణ్, రఘు, శ్రీరామ్, కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.